ప్రజలపై చార్జీల బాదుడు

● విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన ర్యాలీలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని కూటమి ప్రభుత్వం వేసిందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పలాసలో భారీ ర్యాలీని శుక్రవారం చేపట్టారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు నిర్వహించిన కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నుంచి పెద్దెత్తున నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు. జీఎంఈ కాలనీ నుంచి పలాస ఈఆర్‌వో కార్యాలయం వరకు తరలివచ్చిన నిరసనకారులను పలాస ఈఆర్‌వో కార్యాలయం వద్ద సీఐ సన్యాసిరావు, ఏఆర్ కానిస్టేబుల్ అడ్డుకున్నారు. మాజీ మంత్రి అప్పలరాజుతో పాటు ముఖ్యనేతలకు మాత్రమే ప్రవేశం కల్పించారు. నిరసనకారులకు పోలీసులకు మధ్య స్వల్పతోపులాటకు దారితీసింది. అనంతరం మాజీ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సభల్లో విద్యుత్ చార్జీలు పెంచమని, చార్జీలు తగ్గిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ప్రజలపై చార్జీల బాదుడు వేస్తున్నారన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో రూ.6,072.86 కోట్లు, డిసెంబర్‌లో రూ.9,412.50 కోట్లు కలిపి మొత్తంగా 15,485.36 కోట్ల రూపాయలను ఆరు నెలల వ్యవధిలో ప్రజలపై మోయలేని భారం వేశారని అన్నారు. ఇది కదా అసలైన బాదుడే–బాదుడు కార్యక్రమం అని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ చెప్పిన కూటమి నాయకుల మాటల్లో వాస్తవం లేదన్నారు. వీరికి వేలాది రూపాయల కరెంట్ బిల్లులు వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అడ్డగోలు దోపిడీ జరుగుతోందన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేయకుండా బాదుడు అనే పథకం అమలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు రెండు నెలల్లో యూనిట్‌కు మూడు రూపాయలు పెంచారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. 14 సంవత్సరాలు సీఎంగా పని చేసిన సమయంలో చంద్రబాబు ఖజానాను ఖాళీ చేశారన్నారు. రాష్ట్ర ప్రజలు ఒక్కరు కూడా ఆనందంగా లేరన్నారు. వర్షాలు, వరదలతో రైతులు పంటలను నష్టపోతే కనీసం పట్టించుకోలేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, బీమా వర్తింప చేయలేదని అప్పలరాజు మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి స్టీల్ ప్లాంట్ కావాలని అంటారని.. విశాఖలో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను పట్టించుకోరన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తయారు చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను, అన్నింటిని ప్రైవేటు పరం చేయడానికి కూటమి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. రాష్ట్ర రోడ్లలో టోల్‌ప్లాజాను పెట్టి ప్రజలపై మరో భారం వేయడానికి చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ విద్యుత్‌శాఖ ఏఈ వివేకానందానికి నాయకులతో కలిసి మాజీ మంత్రి అప్పలరాజు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావుదొర, ఎంపీపీ డొక్కరి దానయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బోర క్రిష్ణారావు, మీసాల సురేష్‌బాబు, నాయకులు ఉంగ సాయిక్రిష్ణ, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పోతనపల్లి హరిప్రసాద్, శంకర్‌పండా, దువ్వాడ మధుకేశ్వరరావు, బమ్మిడి దుర్యోధనరావు, శిష్టు గోపి, బమ్మిడి సంతోష్, బోర చంద్రకళ, సుజాత గౌరీత్యాడి, బత్తిని హేమేశ్వరరావు, జినగ లోకేశ్వరి, కాటకాన మల్లేశ్వరరావు, పానిల క్రిష్ణారావు పాల్గొన్నారు.


ర్యాలీగా వెళ్తున్న మాజీమంత్రి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు


ఏఈ వివేకానందానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు


కాశీబుగ్గ: పలాసలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరిఅప్పలరాజు ఆధ్వర్యంలో బైకులతో నిరసన ర్యాలీ చేస్తున్న దృశ్యం


కరెంట్ చార్జీల బాదుడు పోరుబాట నిరసన ర్యాలీలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, పార్టీ శ్రేణులు


విద్యుత్ శాఖ ఈఈ శంకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు

● పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే కార్యాలయాలు ముట్టడి చేస్తాం
● టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్

మోసకారి చంద్రబాబు డౌన్..డౌన్..!

టెక్కలి: అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల్లో ఇచ్చిన హామీను తుంగలో తొక్కి పేద, సామాన్య వర్గాలపై చార్జీల భారం వేసి పెద్ద ఎత్తున మోసం చేసిన సీఎం చంద్రబాబు డౌన్.. డౌన్ అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించారు. టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలంతా స్థానిక వైఎస్సార్ జంక్షన్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని తిలక్ ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అమలు లేదు.. కరెంట్ చార్జీలను అమలు చేశారు, విద్యుత్ బిల్లులతో షాక్ ఇచ్చిన చంద్రబాబు డౌన్ డౌన్, ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని తదితర నినాదాల ప్లకార్డులతో వైఎస్సార్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్, మెయిన్ రోడ్ మీదుగా విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ కొనసాగించారు. అనంతరం ఈఈ శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హామీని మరిచిపోయి సుమారు 15,485 కోట్ల రూపాయల కరెంట్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని.. లేని పక్షంలో విద్యుత్ కార్యాలయాల ముట్టడికి సిద్ధంగా ఉన్నామని తిలక్ హెచ్చరించారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావు, నాయకులు ఆర్.ఉమామల్లయ్య, ఎస్.సత్యం, ఎ.రాహుల్, కె.గోవింద్, వై.చక్రవర్తి, టి.కిరణ్, ఎ.రామారావు, ఎస్.హేమసుందర్‌రాజు, ఆర్.జయమోహన్, పి.రమణబాబు, కె.జీవన్, ఎన్.సాబతో, కె.శ్రీధర్‌రెడ్డి, పి.వెంకట్రావు, బి.మోహన్‌రెడ్డి, ఎన్.భీమారావు, కె.రవికుమార్ గాంధీ, హెచ్.వెంకటేశ్వరరావు, ఆర్.మురళీరెడ్డి, మదీన్, కె.సంజీవ్, జె.జయరాం, చిన్ని జోగారావు, పి.మోహనరావు, బి.ఉదయ్, జి.మోహన్‌రెడ్డి, బి.రాజేష్, పి.వీరవసంత్, బి.జయరాం, ఎం.గణపతిరావు, డి.పోలయ్య, డి.కూర్మారావు, ఆర్.డిల్లీ, బి.ధనుంజయ్, ఎస్.సురేష్, డి.కుశుడు పాల్గొన్నారు.


సోంపేటలో విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


విద్యుత్‌శాఖ ఏడీ రవికి వినతి పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

● జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
● సూపర్ సిక్స్ కాదు..సూపర్ బాదుడు
● ఎమ్మెల్సీ నర్తు రామారావు

చలికాలంలో చెమటలు పట్టిస్తున్నారు

సోంపేట: విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలకు చలికాలంలో కూడా కూటమి ప్రభుత్వం చెమటలు పట్టిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి శుక్రవారం భారీ ర్యాలీని సోంపేటలో నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని పార్టీ శ్రేణులతో కలిసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ.. కూటమి సర్కార్ విద్యుత్ చార్జీలను పెంచి వినియోగదారులపై భారం వేశారన్నారు. గతంలో పని చేసిన ఏ ముఖ్యమంత్రి కూడా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో వినియోగదారులపై ఇంత భారం వేయలేదన్నారు. సుమారు రూ. 15 వేల కోట్లు ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్లు ఫ్రీగా ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా చార్జిల పెంచి ప్రజలను బాదేస్తున్నారన్నారు.

అనంతరం పెంచిన చార్జీలను పెంచాలని కోరుతూ విద్యుత్ శాఖ ఏడీ రవి, ఏఈ రామారావులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీపీలు నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, నాయకులు శిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ, పాతిన శేషగిరి, పైడి పట్టాభి, ఉగ్రపల్లి తిరుపతిరావు, కొట్ని శ్రీనివాసరావు, పిలక సంతోష్, కారంగి మోహనరావు, కడియాల ప్రకాష్, ఇప్పిలి క్రిష్ణారావు, వజ్జ మృత్యుంజయం, లడ్డు కేశవ్ పాత్రో, కొనపల సురేష్, పూడి నేతాజి, నీలయ్య, జల్లు యుగంధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

పలాస: గోదావరిపురం గ్రామానికి చెందిన జోరు శంకరరావును 46 నాటు సారా ప్యాకెట్లతో కాశీబుగ్గ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పెదంచల గ్రామం వద్ద గురువారం రాత్రి సారా ప్యాకెట్లతో పట్టుబడినట్టు కాశీబుగ్గ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు తెలిపారు.

20 లీటర్ల సారాతో ఇద్దరు..

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటు సారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ కె.బేబి తెలిపారకు. కొర్లాంలో పది లీటర్ల సారాతో ఒకరిని, మందస మండలం పొత్తంగిలో పది లీటర్ల సారాతో మరొకరిని అరెస్టు చేశామన్నారు.

వినతులను పరిష్కరించాలి:ఎస్పీ


వృద్ధురాలి వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ వారం 19 వినతులను ఎస్పీ స్వీకరించారు.

కాశీబుగ్గ పట్టణ సీఐగా సూర్యనారాయణ



కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచి విభాగంలో సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన దాడి మోహనరావు శ్రీకాకుళం జిల్లా కేంద్రం స్పెషల్ బ్రాంచికి బదిలీపై వెళ్లారు.

వైభవంగా శత చండీయాగం


సామూహిక కుంకుమార్చనలో మహిళలు

కవిటి: రాజపురంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం శతచండీయాగం వైభవంగా జరిగింది. ఆలయ 42 వ వార్షికోత్సవంలో భాగంగా వేకువజామున సంతోషిమాతకు సుప్రభాతసేవ, ఆభరణాలంకారసేవ నిర్వహించారు. మహిళలచే లలితా సహస్రనామ స్తోత్రసహిత సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

అలరించిన గణిత అవధానం


గణిత అవధానం నిర్వహిస్తున్న తిరుపతిరావు

కంచిలి: ఎస్.ఆర్.సి.పురం ప్రాథమిక పాఠశాలలో గణిత అవధాని మడ్డు తిరుపతిరావు సారథ్యంలో శుక్రవారం నిర్వహించిన గణిత అవధానం ప్రక్రియ విద్యార్థులకు అలరించింది. గణిత శాస్త్రంలో సమస్యల సాధనకు వేగం, కచ్చితత్వం మూలకారణమని గణిత అవధాని తిరుపతిరావు అన్నారు. జాతీయ గణిత వారోత్సవాల్లో భాగంగా ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో 262వ గణిత దశావధానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం పి.ముకుందరావు, ఉపాధ్యాయ సిబ్బంది అవధాని తిరుపతిరావును దుశ్శాలువతో సన్మానించారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష రేపు

పలాస: వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (పలాస) అధ్యక్షులు బొమ్మాళి శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి

టెక్కలి రూరల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. బొరిగిపేటలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఒకటి వరకు పోలీసు యాక్టు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అన్ని ప్రాంతాలలో జనవరి ఒకటో తేదీ వరకూ పోలీసు యాక్టు అమలలో ఉంటుందని డీఎస్పీ వి.వెంకటఅప్పారావు తెలిపారు. ఈ సమయంలో ఎటువంటి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం లేదన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

కాశీబుగ్గ: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో వివిధ రకాలైన సేవలు అందిస్తున్న వారికి ఎన్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

60 కుర్చీలు వితరణ


వితరణ చేసిన కుర్చీల వద్ద దాతలు

పలాస: బొడ్డపాడు గ్రామంలోని అమరవీరుల స్మారక మందిరానికి ఆ గ్రామానికి చెందిన గిరిజన ప్రజాసంఘం నాయకుడు బచ్చల విప్లవ కుమార్‌తో పాటు మరికొంత మంది కలసి 60 కుర్చీలను వితరణగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. విప్లవ ప్రజాసంఘాల అవసరాల కోసం సభలు సమావేశాలు నిర్వహించుకోవడానికి స్మారక మందిరం గతంలో ఏర్పాటు చేశామన్నారు. బచ్చల విప్లవకుమార్ 40, తంగుడు రామక్రిష్ణ 10, బొడ్డు చంద్రమౌళి 10 కుర్చీలను సమకూర్చారన్నారు. మరికొందరు కుర్చీలను సమకూర్చుతామని ప్రకటించారు. గ్రామ పెద్దలు బొడ్డు అప్పారావు, బచ్చల సూర్యనారాయణ, రాజాం గుణవంతు, తామాడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, రాజాం శ్రీనివాస్, పీవోడబ్ల్యూ నాయకురాలు పోతనపల్లి కుసుమ, రాపాక మాధవరావు, పత్రి దానేసు, సాలిన వీరాస్వామి, మద్దిల రామారావు ఉన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం


వేతన ఒప్పందం కుదరడంతో కరచలనం చేసుకుంటున్న ఇరువర్గాల ప్రతినిధులు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రైసుమిల్లర్లకు అందులో పనిచేస్తున్న కార్మికులకు మధ్య వేతన ఒప్పందం కుదిరింది. పలాస తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి సమక్షంలో కార్మికులకు, మిల్లు యాజమాన్యాలకు మధ్య జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. మిల్లు యాజమాన్యాలు గతంలో ఉన్న వేతనాలకన్నా అదనంగా 15 శాతం పెంపుదలకు అంగీకరించారు. 2026 వరకు ఈ ఒప్పందం ఉంటుందని ఇరువర్గాలు కాగితాలపై సంతకాలు చేశారు. దీంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. చర్చల్లో రైసు మిల్లు సంఘం అధ్యక్షులు డోకి రామారావు, కార్యదర్శి కె.వి.గోపాల్, కోశాధికారి సిందిరి కిషోర్, కాష్యూలేబర్, రైసుమిల్లు కార్మిక సంఘాల అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శి సార ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, గౌరవ అధ్యక్షులు బొంపెల్లి సింహాచలం పాల్గొన్నారు.

108 వాహనాల తనిఖీ

టెక్కలి: ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మరింత చేరువగా సేవలు అందజేయాలని 108 జిల్లా కోఆర్డినేటర్ కె.ప్రకాశరావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో 108 వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందులు, పరికరాల పనితీరును పరిశీలించారు. ఈయనతో పాటు సిబ్బంది పి.శ్రీనివాస్, ఆదినారాయణ, జగదీష్, సతీష్, ఫాల్గుణ, వెంకటరమణ, ఆనంద్, ఉపేంద్ర, శేఖర్, ప్రసాద్ ఉన్నారు.

గేట్ పరీక్షపై అవగాహన

టెక్కలి: జాతీయ స్థాయి గేట్ పరీక్షపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఏస్ అకాడమి సంస్థ ప్రతినిధి మణిమోహన్ త్రినాథ్ నేతృత్వంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు డి.యుగంధర్ పాల్గొన్నారు.

పల్లెకు చేరని ఆర్టీసీ సేవలు!

● ప్రైవేటు వాహనాలే ప్రజలకు దిక్కు


బస్సులో వేలాడి ప్రయాణిస్తున్న విద్యార్థులు


సాయంత్రం వేళలో బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థుల

కంచిలి: అన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ప్రభుత్వ ప్రతినిధులు చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు పొంతనలేకుండా పోతోంది. ఆర్టీసీకి అధిక ఆదాయం తెచ్చిపెడుతున్న గ్రామీణ ప్రాంతాలపైన ఆ సంస్థ అధికారులు చిన్నచూపు చూపిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అవసరమైన గ్రామీణ ప్రాంతాలకు అరకొరగా సర్వీసులు నడుపుతుండటంతో ప్రజలు ప్రైవేటు వాహనాపైనే ఆధారపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్టీసీ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. కొన్ని గ్రామాలకే నామమాత్రపు ట్రిప్పులతో బస్సు సర్వీసులు నడుపుతున్నారు. కంచిలి మండల పరిధిలో ప్రస్తుతం సోంపేట నుంచి ఘాటీ ముకుందాపురం, కుంబరినౌగాం, పెద్దశ్రీరాంపురం రూట్లలో మాత్రమే సర్వీసులు నడుపుతున్నారు. తాజాగా శాసనాం నుంచి సోంపేటకు బస్సు సర్వీసును ప్రారంభించారు. ఆ ప్రాంతంలో గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్లు ఉన్నప్పటికీ అక్కడకు బస్సు సర్వీసులు నడపడం లేదు. మరోవైపు బురదపాడు,బొనమాళి, జెన్నాగాయి, కుమ్మరిపేట, బొగాబెణి రూట్‌లోను, పెద్దకొజ్జిరియా రూట్‌లో, మకరాంపురం రూట్‌లో, కొనక తదితర గిరిజన ప్రాంతాలకు బస్సు సర్వీసును నడపాల్సి ఉంది.

బస్సుల వేళలు మార్పులేక ఇబ్బందులు

ఇటీవల పాఠశాలలు, కళాశాలలు వేళలు మార్పు చేసినప్పటికీ బస్సు వేళల్లో మార్పులు చేపట్టలేదు. దీని వలన బస్సుల్లో వచ్చే విద్యార్థులు ఆలస్యం అవ్వడంతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఉదయం తొమ్మిది గంటలకు విద్యాసంస్థలు తెరుస్తుండగా, బస్సులు మాత్రం పాత టైమింగ్స్‌లోనే నడుపుతున్నారు. ఘాటీముకుందాపురం నుంచి ఉదయం తొమ్మిది గంటలకు తీస్తున్న బస్సు కంచిలికి పది గంటలకు చేరుతోంది. మరోవైపు కుంబరినౌగాం నుంచి వచ్చే బస్సు ఉదయం 8.30 గంటలకు బయలుదేరి, కంచిలి వచ్చేసరికి 9.50 గంటలు అవుతోంది. అలాగే సాయంత్రం ఐదు గంటలకు కళాశాల విడిచిపెడుతుండగా ఘాటీముకుందాపురం రూట్‌కు వెళ్లే బస్సు సాయంత్రం నాలుగు గంటలకే వెళ్లిపోతోంది. ఆ రూట్‌లో వెళుతున్న విద్యార్థులు తర్వాత బస్సు వచ్చేసరికి చీకటి అవుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. సిలగాం తదితర గ్రామాల నుంచి కళాశాలలకు వస్తున్న విద్యార్థులు ఆర్టీసి బస్సు ఆ రూట్‌లో నడవపోవడంతో ఆటోల్లోను, ఇతర ప్రైవేటు వాహనాలపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితిని ఆర్టీసి అధికారులు గుర్తించి, కొత్త రూట్లలో బస్సులు వేయడంతోపాటు టైమింగ్స్ విషయంలో విద్యాసంస్థలు ప్రారంభం, విడిచిపెట్టే వేళల్లో నడిచేటట్లు చూడాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సులు నడపాలి



సిలగాం రూట్‌లో ఆర్టీసీ బస్సులులేక ప్రైవేటు సర్వీసులపైనే ఆధార పడుతున్నాం. రోజూ కళాశాలకు వచ్చేటప్పుడు మా ప్రాంతం నుంచి మంగళవారం సంతకు ఒక ఆటోలో, అక్కడి నుంచి కంచిలికి మరో సర్వీసులో వస్తున్నాం. దీని వలన కళాశాలకు వచ్చేటప్పటికీ ఆలస్యం అవుతోంది. కొన్ని పిరియడ్లను మిస్ అవుతున్నాం. మా రూట్‌లో ఆర్టీసీ బస్సు నడపాలి.

–టి.అంకిత, ఇంటర్ విద్యార్థిని, కొండిపుట్టుగ, కవిటి మండలం

బస్సు వేళల్లో మార్పు చేయాలి



మా ప్రాంతం నుంచి నడిచే బస్సు వేళల్ని కళాశాల సమయాలకు తగ్గట్టుగా మార్పు చేయాలి. ప్రస్తుతం పాత టైమింగ్స్‌లో బస్సులు నడుస్తుండటంతో, మేం కళాశాలకు వచ్చేసరికి ఆలస్యం అవుతోంది. దీని వలన తరగతులకు అందడం లేదు.

–పి. ధర్మరాజు, ఇంటర్ విద్యార్థి, ఘాటీ భవానీపురం, కంచిలి మండలం

మన్మోహన్‌సింగ్ సేవలు వెలకట్టలేనివి


మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు తదితరులు


టెక్కలి: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పేరాడ తిలక్, నాయకులు


కాశీబుగ్గ: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు తదితరులు


కాశీబుగ్గ: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష


ఇచ్ఛాపురం: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సోంపేట: భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఎంతో కృషి చేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఆయన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోంపేటలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీపీలు నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు శిలగాన భాస్కరరావు పాల్గొన్నారు. బారువలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు చాణక్య, గ్రామస్తులు అమర లోకనాథం, శంకరరావు పాల్గొన్నారు.

టెక్కలిలో..

టెక్కలి: మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. టెక్కలి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మన్మోహన్‌సింగ్ తీసుకొచ్చిన సంస్కరణలను తిలక్ ప్రస్తావించారు.

● మన్మోహన్‌సింగ్ మృతిపై కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన సారథ్యంలో కేంద్ర సహాయ మంత్రిగా పని చేసి విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన్మోహన్‌సింగ్ మృతిపై జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీపీ స్టాలిన్ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కాశీబుగ్గ: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్‌కు మృతిపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విచారం వ్యక్తం చేశారు. పలాసలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తన కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని ప్రజాప్రస్థాన వేదిక టూరిజం పార్కు ఆవరణలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.